క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు



భద్రకాళిసమేత వీరభద్రేశ్వర స్వామికి మంగళహారతి ఇస్తున్న పూజారి

ఆదోనిఅర్బన్: పట్టణంలో అమావాస్య సందర్భంగా విష్ణు, శైవ ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో స్వామివార్లకు ప్రత్యేకంగా అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఈ మేరకు పట్టణ శివారు కోటనగర్‌లో వెలసిన శ్రీ కోట భద్రకాళి సమేత వీరభద్రేశ్వర స్వామికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, పూల అలంకరణ, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా చంద్రమౌళేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు.

పోషకాహార కిట్ల పంపిణీ

ఆదోనిరూరల్: స్థానిక ఏరియా ఆస్పత్రి ఆవరణలోని ఆర్‌టీపీసీ ఛాంబర్‌లో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర సత్యవతి, డాక్టర్ బాలమురళీకృష్ణ, డాక్టర్ అమూల్య, సూపర్‌వైజర్ బాబురాజు ఆధ్వర్యంలో గురువారం క్షయవ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడారు. టీచర్ నిరంజన్‌కుమార్ 10 మంది క్షయవ్యాధిగ్రస్తులను దత్తత తీసుకొని ప్రతి నెల రూ.వెయ్యి విలువచేసే పోషకాహార కిట్లను పంపిణీ చేయడం గొప్ప విషయమన్నారు. దాతల సహకారంతో క్షయవ్యాధిగ్రస్తులకు మేలు జరుగుతుందన్నారు. మరింత మంది దాతలు ముందుకొస్తే క్షయవ్యాధిని నిర్మూలించే అవకాశం ఉంటుందన్నారు. 2025 నాటికి టీబీ రహిత దేశంగా తీర్చిదిద్దవచ్చన్నారు. ఎంపీహెచ్‌ఎస్ లలితమ్మ, సూపర్‌వైజర్ స్వరూప్‌రాజ్‌కుమార్, సిబ్బంది సుబ్బమ్మ బాయి, వీరేష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

వైభవంగా దేవర



పూర్ణకుంభాలతో ఊరేగింపుగా వస్తున్న గ్రామస్తులు

మంత్రాలయం: శూన్య అమావాస్య పురస్కరించుకుని మంత్రాలయం మండల కేంద్రంలో గ్రామస్తులు దేవర జరుపుకున్నారు. గురువారం ఉదయాన్నే పంట పొలాల చుట్టూ పొలి చల్లుకున్నారు. ఇళ్లలో ప్రత్యేక నైవేద్యాలు తయారుచేసి గ్రామ దేవత మంచాలమ్మకు సమర్పించారు. డప్పు దరువులు మంగళవాయిద్యాలతో కుంభోత్సవం కనులపండువగా సాగింది. ఊరి ఆడపడచుల సందడితో దేవర ఉత్సవం కనువిందు చేసింది.

బసవేశ్వర స్వామికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో బసవేశ్వర స్వామి

కోసిగి: మండల కేంద్రంలోని బసవన్న కొండపై వెలసిన శ్రీ బసవేశ్వర స్వామికి గురువారం అమవాస్య పర్వదినం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఉమేష్ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి వేకువజాము నుంచి జలాభిషేకం, పంచామృతాభిషేకం, వెండికవచ అలంకరణ, ఆకుపూజలు గావించి మహా మంగళ హారతులు పట్టి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని నారికేలాలు సమర్పించి పూజలు చేశారు. భక్తాదులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

పింఛన్ల పంపిణీ



కౌతాళంలో కొత్త పింఛన్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

కౌతాళం: పేదల సంక్షేమం కోసమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తపన అని బదినేహాల్ గ్రామ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వీరభద్రగౌడ్ అన్నారు. గ్రామానికి కొత్తగా మంజూరైన పింఛన్లను గురువారం ఉప సర్పంచ్ ప్రసన్నగౌడ్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటి వరకు ఎవ్వరూ చేయలేని విధంగా సంక్షేమ పథకాలను అమలుచేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నెలకు రూ.3 వేల పింఛన్ అందిస్తూ ఇచ్చిన మాట నిలుపుకున్నారని గుర్తుచేశారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. నాయకులు శివనాథ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఉమకాంత్‌రెడ్డి, పలువురు పాల్గొన్నారు.

రసవత్తరంగా 'ఆడుదాం-ఆంధ్ర' క్రీడాపోటీలు

ఆదోని సెంట్రల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం- ఆంధ్ర క్రీడాపోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. గురువారం పట్టణంలోని ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానం, అక్షరశ్రీ పాఠశాల ఆవరణలో క్రీడాపోటీలు నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడాంశాల్లో ఆయా జట్లు తలపడ్డాయి. తమ ప్రతిభను చాటుకునేందుకు క్రీడాకారులు పోటీపడ్డారు. పట్టణం నుంచి కబడ్డీలో 22 జట్లు పోటీపడగా 1వ వార్డు జట్టు, 8వ వార్డు జట్టు విజయం సాధించాయి. వాలీబాల్‌లో 27 జట్లు పోటీ పడగా 1వ వార్డు జట్టు, 16వ వార్డు జట్టు విజయం సాధించాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన జట్లు సైతం దూకుడు ప్రదర్శించాయి. బల్లేకల్ జట్టు ఫైనల్‌కు చేరుకోగా కుప్పగల్, హానవాళు జట్లు పెద్దహరివాణం జట్లతో పాటా పోటీగా తలపడుతున్నాయి. ఖోఖో పోటీల్లో 4 జట్లు పాల్గొనగా ధణాపురం జట్టు విన్నర్‌గా, కుప్పగల్ జట్టు రన్నర్‌గా నిలిచాయి. వాలీబాల్ పోటీల్లో 22 జట్లు పాల్గొనగా పెద్దహరివాణం జట్టు విన్నర్, పెసలబండ జట్టు రన్నర్‌గా నిలిచినట్లు కో-ఆర్డినేటర్లు నరసయ్య, ఓబన్న తెలిపారు. క్రీడారంగాన్ని ప్రోత్సహించేందుకు, యువత ఆరోగ్యవంతులుగా ఉండేందుకు ఇలాంటి క్రీడలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు.



ఆదోనిలో టాస్ వేసి పోటీలను ప్రారంభిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు



కౌతాళంలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

కోసిగి: 'ఆడుదాం - ఆంధ్ర' మండల స్థాయి క్రీడ పోటీలు అట్టహాసంగా జరిగాయి. గురువారం కోసిగి బాలుర ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో రెండవ రోజు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించారు. ప్రతిభ కలిగిన వారిని తాలుకా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పీడీ ఖలీల్ అహ్మద్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, పీఈటీలు పాల్గొన్నారు.

కౌతాళం: ఆడుదాం-ఆంధ్ర పోటీల్లో భాగంగా గురువారం మండల స్థాయి లీగ్ మ్యాచ్‌లు రెండవ రోజు కొనసాగాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీల్లో క్రీడాకారులు సత్తా చాటారు. శుక్రవారం వరకు ఆయా క్రీడాంశాల్లో, ఈ నెల 20వ తేదీ వరకు క్రికెట్ పోటీలు జరుగుతాయని పీఈటీలు తెలిపారు.



కబడ్డీ ఆడుతున్న బాలుర జట్లు



వాలీబాల్‌లో తలపడుతున్న క్రీడాకారులు



కోసిగిలో ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

కళాకారులకు సన్మానం



కళాకారులను సన్మానిస్తున్న లలితకళా సేవా సంస్థ సభ్యులు

ఆదోనిఅర్బన్: ప్రముఖ గాయకుడు జేసుదాసు జన్మదినం సందర్భంగా లలితకళా సేవాసమితి ఆధ్వర్యంలో పట్టణంలోని కళాకారులకు సన్మానం జరిగింది. గురువారం స్థానిక మహాయోగి లక్ష్మమ్మవ్వ రంగస్థల కళాసమితి భవనంలో జేసుదాసు జన్మదినం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు తబల రాముడు, లక్ష్మయ్య, విష్ణు, నరసింహులకు శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానం చేశారు. లలిత కళా సేవా సంస్థ సభ్యుడు నల్లారెడ్డి మాట్లాడుతూ జేసుదాసు పాడిన పాటలు ఆణిముత్యాల్లాంటివన్నారు. సభ్యులు హనుమాన్‌సింగ్, శివరాములు, లక్ష్మన్నయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డె ఓబన్నకు నివాళి



అగసనూరులో నివాళులర్పిస్తున్న దృశ్యం

కోసిగి: మండల పరిధిలోని అగసనూరు గ్రామంలో స్వాతంత్ర్య ఉద్యమకారుడు వడ్డె ఓబన్న 217వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం సర్పంచ్ వడ్డె ఉలిగయ్య, వడ్డెర సంఘం తాలుకా నాయకులు ఓర్సు నాగరాజు తదితరులతో కలిసి ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయులలో వడ్డె ఓబున్న ఒకరని గుర్తుచేశారు. వడ్డెర కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. సంఘం నాయకులు టీవీ సిద్దయ్య, వీరేష్, విశ్వనాథ్, భీమేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఉరుకుందకు పోటెత్తిన భక్తజనం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో వేలాది మంది భక్తులతో సందడి నెలకొంది. గురువారం అమావాస్య ఉండడంతో భక్తులు తమ ఇలవేల్పును దర్శించుకోవడానికి వేలాదిగా తరలివచ్చారు. బుధవారం సాయంత్రం నుంచే స్వామి భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసర ప్రాంతాలన్నీ కిటకిటలాడాయి. దర్శనం కోసం గంటకు పైగా సమయం పట్టింది. తెల్లవారు జామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. అసిస్టెంట్ కమిషనర్ వాణి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే ఉరుకుందకు 5 కి.మీ దూరంలో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయ స్వామి ఆలయం, తుంగభద్ర నది ఒడ్డున మేళిగనూరు గ్రామంలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది.



పూజలందుకుంటున్న ఈరన్నస్వామి మూలవిరాట్



స్వామివారి దర్శనం కోసం క్యూలో వస్తున్న భక్తులు

వాహనాల తనిఖీ

మంత్రాలయం: సర్కిల్ పరిధిలోని కల్లుదేవకుంట గ్రామంలో జాతీయ రహదారిపై పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. డీఎస్పీ సీతారామయ్య ఆదేశాల మేరకు గురువారం ఎస్‌ఐ వేణుగోపాల్ రాజు నేతృత్వంలో నాకాబందీ నిర్వహించారు. అక్రమ మద్యం, నగదు రవాణాలను అరికట్టే నేపథ్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మట్లాడుతూ.. సరైన వాహన ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలను నడపరాదని సూచించారు. అలాగే వాహనాలలో అక్రమంగా మద్యం, నగదు, నగలు తరలిస్తే చర్యలు ఉంటాయన్నారు. తనిఖీల్లో ఏఎస్‌ఐ ఆనందరెడ్డి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఇరుముడితో శబరిమలకు

కోసిగి: మండల కేంద్రానికి చెందిన అయ్యప్ప మాలధారులు ఇరుముడితో అయ్యప్ప స్వామి దర్శనార్థమై శబరిమలకు బయలు దేరారు. గురువారం స్థానిక బీరప్ప స్వామి ఆలయంలో గురుస్వామి చంద్రశేఖర్ స్వామి ఆధ్వర్యంలో మాలధారులతో ఇరుముడి కట్టించారు. ముందుగా ఆలయంలో అయ్యప్ప స్వామికి పడి పూజ, అభిషేకాలు, మహామంగళ హారతులు గావించి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్త భజన పాటలతో స్వామి వారిని ప్రార్థించారు. అనంతరం పూజలకు వచ్చిన భక్తాదులకు అన్నదానం చేశారు. దీక్షాపరులు శ్రీనివాసులు, ఫణీంద్రబాబు, నాగరాజు,మంజు, మనోజ్‌దాస్‌ను కుటుంబ సభ్యులు ఊరేగింపుగా సాగనంపారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

ఆదోనిఅర్బన్: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో గురువారం ముగ్గురికి గాయాలయ్యాయి. మండలంలోని గణేకల్ సమీపంలో తల్లి, కుమారుడు బైకుపై వెళ్తుండగా కారు ఢీకొనడంతో ఫాతిమా అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. పెద్దతుంబళం గ్రామానికి చెందిన ఫాతిమా కుమారుడితో కలిసి ఆదోని నుంచి తమ సొంత గ్రామానికి వెళ్తుండగా గణేకల్ సమీపంలో కారు ఢీకొట్టడంతో వెంటనే స్థానికులు ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. అలాగే ఎమ్మిగనూరు సమీపంలోని కోటేకల్ గ్రామం వద్ద పట్టణానికి చెందిన వెంకటేష్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. స్థానికులు వెంటనే ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. అలాగే పట్టణానికి చెందిన రామలింగ బైకుపై వెళ్తుండగా ఎమ్మిగనూరు రోడ్డులో ఆటో ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. ఆయన్ను ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.



గాయపడిన ఫాతిమా



గాయపడిన రామలింగ

హామీ నెరవేర్చిన ఎమ్మెల్యే



ముస్లిం శ్మశాన వాటికలో బోరు వేసిన దృశ్యం

పెద్దకడబూరు: ఇచ్చిన హామీని నెరవేర్చుతూ ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి చిన్నతుంబళంలో బోరు వేయించారు. గ్రామంలో ఎమ్మెల్యే చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ముస్లింలు శ్మశాన వాటికలో నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నట్లు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే రూ.లక్షకు పైగా సొంత నిధులు వెచ్చించి గత నెలలో బోరు వేయించారు. బోరులో నీరు పడడంతో గురువారం మోటారు బిగించి నీటిని సరఫరా చేశారు. ఈ సందర్భంగా గ్రామ ముస్లిం పెద్దలు మాట్లాడుతూ .. ఇచ్చిన మాట ప్రకారం సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. గొర్రెల ఫెడరేషన్ జిల్లా డైరెక్టర్ యల్లప్ప, నాయకులు బొడ్డన్న, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా జితామిత్ర తీర్థుల ఆరాధన

మంత్రాలయం: కర్ణాటకలోని జితామిత్ర ద్వీపకల్పంలో వెలసిన మధ్వమత పూర్వపు పీఠాధిపతి జితామిత్ర తీర్థుల ఆరాధన వేడుక శాస్త్రోక్తంగా చేపట్టారు. రాఘవేంద్ర స్వామి పీఠాధిపతి సుభుదేంద్ర తీర్థుల నేతృత్వంలో జితామిత్రుల మూల బృందావనానికి జల, పుష్ప పంచామృతాభిషేకం గావించారు. వేద పఠనం మధ్య శాస్త్రోక్తంగా విశిష్ట పూజలు చేపట్టారు. అనంతరం పీఠాధిపతి జితామిత్ర తీర్థుల చరిత్రను భక్తులకు వివరించారు. సప్త ముద్రధారణతో భక్తులకు ఫలమంత్రాక్షింతలతో ఆశీర్వాదవచనాలు చేశారు.



జితామిత్ర బృంధావనానికి హారతులు పడుతున్న పీఠాధిపతి సుభుదేంద్ర తీర్థులు

ఆదోనిలో ముగిసిన కేంద్ర మంత్రి పర్యటన

ఆదోనిరూరల్: కేంద్ర ఆరోగ్య శాఖ, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి సత్యపాల్‌సింగ్ బఘేల్ మూడు రోజుల కర్నూలు జిల్లా పర్యటన గురువారంతో ముగిసింది. బుధవారం ఆదోని పట్టణంలో నూతన బీజేపీ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం, వెటర్నరీ ఆస్పత్రి సందర్శన అనంతరం ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో రాత్రి బసచేసిన విషయం తెలిసిందే. గురువారం ఉదయం బీజేపీ కర్నూలు జిల్లా కార్యదర్శి రమాకాంత్ స్వగృహంలో అల్పాహార కార్యక్రమంలో పాల్గొని స్థానిక బీజేపీ కార్యకర్తలతో కాసేపు మాటామంతి అనంతరం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పద్మశాలి కుల సంఘ పెద్దలతో మాట్లాడారు. రమాకాంత్ కుటుంబ సభ్యులు కేంద్ర మంత్రిని సన్మానించారు. అనంతరం ఆయన రోడ్డు మార్గం గుండా పగిడిరాయి గ్రామంలో జరిగే కార్యక్రమంలో హాజరయ్యారు. మంత్రితో పాటు బీజేపీ నాయకులు కునిగిరి నీలకంఠ, ఉపేంద్రకుమార్, ఆదూర్ విజయ్‌కృష్ణ, జిందే సాయికుమార్, నాగరాజుగౌడ్, శ్రీనివాస ఆచారి, అంజయ్, కాశీ, రామంజి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.



గౌరవయ్యల సమస్యలు తెలుసుకుంటున్న కేంద్ర మంత్రి సత్యపాల్‌సింగ్ బఘేల్

గ్రామ దేవతలకు విశేష పూజలు



పూజలందుకుంటున్న మారెమ్మ దేవి

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో గ్రామ దేవతలు మారెమ్మ దేవి, సుంకులమ్మ దేవిలకు విశేష పూజలు చేపట్టారు. గురువారం అమావాస్య పర్వదినం పురస్కరించుకుని గ్రామ ప్రజలు ఇళ్లలో నైవేద్యాలు తయారు చేసి సిద్దప్పపాళెం, కడపాళెం, చింతలగేని కాలనీలో వెలసిన దేవతలకు సమర్పించారు. అమ్మవారికి నారికేలాలు సమర్పించి పూజలు చేశారు. చల్లంగా చూడాలని దేవతలను వేడుకున్నారు.

గ్రామదేవతలను దర్శించుకున్న ఎమ్మెల్యే



గణేకల్‌లో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

ఆదోనిరూరల్: మండలంలోని గణేకల్ గ్రామంలో కొలువుదీరిన బంగారమ్మవ్వ దేవర ఉత్సవాల్లో ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. బంగారమ్మవ్వ, దేవమ్మవ్వ, లక్ష్మమ్మవ్వ, సుంకులమ్మవ్వ దేవాలయాలకు వెళ్లి గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామదేవతలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, కోరిన కోర్కెలు నెరవేర్చే దేవతలుగా అమ్మవార్లు పేరుగాంచారన్నారు. ఆలయాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే చెప్పారు. అంతకుముందు ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. పూలమాలలు వేసి, దుశ్శాలువాలతో ఆహ్వానించారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ నాయకులు ఉన్నారు.

1500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

పెద్దకడబూరు: మండల పరిధిలోని హనుమాపురం గ్రామ చుట్టుపక్కల కొండల్లో గురువారం 1500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహేష్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. హనుమాపురం గ్రామంలో అక్రమంగా నాటుసారా కాస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ఆకస్మికంగా స్పెషల్ పార్టీతో వెళ్లి కొండల్లో గాలింపు చేపట్టినట్లు తెలిపారు. అక్కడ లభ్యమైన బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. నాటుసారా కాస్తున్న నలుగురు వ్యక్తులను పట్టుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నాటుసారా, కర్ణాటక మద్యం తరలింపు, అల్లర్లకు పాల్పడేవారిపై నిఘా ఉంచామన్నారు. ఎవరైనా అలాంటి వాటికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



బెల్లం ఊటను చూపుతున్న ఎస్‌ఐ మహేష్‌కుమార్

మత సామరస్యానికి ప్రతీక కౌతాళం దర్గా

కౌతాళం: సర్వమతాల సమ్మేళనానికి ప్రతీక ఖాదర్‌లింగ స్వామి దర్గా. తల్లి గర్భం నుంచే మహిమలు ప్రదర్శిస్తూ వేలాది మంది శిష్యులను కూడగట్టుకున్న గురువు ఖాదర్ లింగస్వామి పేదల కష్టాలను తీర్చే కరుణామయుడు. బహుబాషా కోవిదులు హజరత్ ఖాజా సయ్యద్ షా అబ్దుల్ ఖాదిర్ మహమ్మద్ హుసేన్ అసలు పేరు కాగా శిష్యులందరూ కలిసి శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామిగా కొలుస్తున్నారు. రాష్ట్రంలోనే గాక పక్క రాష్ట్రాల్లోనూ స్వామి వారికి భక్తులు ఉన్నారు.

స్వామి వారి చరిత్ర

పూర్వం కర్ణాటక రాష్ట్రంలోని బిజాపూర్ పట్టణంలో కొలువైన అమినూద్దీన్ అలీఆలా షేర్‌ఏఖుదా వారి ఆజ్ఞానుసారం ఖాదర్ లింగస్వామి కౌతాళంకు వచ్చారు. అప్పట్లో ఆయన లింగం ధరించడాన్ని ఈ ప్రాంతంలోని శైవమతస్తులు కొందరు అభ్యంతరం చెప్పారు. భగవంతుడు ఎవరి సొంతం కాదని పరమేశ్వరుడి ప్రతీక అయిన లింగంపై ఎవరికీ హక్కు లేదని ఆయన వారితో వాదించారు. శైవ మతస్తులను సమావేశపరిచి వారి మెడలో ఉన్న లింగాలను బావిలో వేసి మళ్లీ రప్పిస్తే తాను గ్రామం వదలి వెళతానని, వారు అలా చేయలేక తాను లింగాలను తిరిగి రప్పించగలిగితే ఆక్రమించుకున్న తన స్థలాన్ని స్వాధీనం చేసుకుని శాశ్వతంగా ఉండడానికి ఒప్పందానికి వచ్చారు. ఈ ప్రయత్నంలో ఆయన శివుడిని మెప్పించి లింగాలను బావి నుంచి రప్పించారు. అప్పటినుంచి గ్రామస్తులంతా ఆయన్ను మత సామరస్యంతో ఖాదర్‌లింగ స్వామిగా పూజించనారంభించారు. ఆయనకు ముగ్గురు భార్యలు, ఐదుగురు కుమారులు. గ్రామస్తులు ఇచ్చిన స్థలంలోనే ఆయన సమాధి అయ్యారు. ఆయన వంశస్తులు, ప్రస్తుత ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ ట్రస్టీగా ఉన్నారు. బీజాపూరి వారికి హజరత్ ఖ్వాజా సయ్యద్ షా అబ్దుల్ ఖాదరి వుసేని చిష్తీ 12 సంవత్సరాలు శిష్యరికం చేశారు. గురువు ఆజ్ఞానుసారం మానవుల్లో మౌఢ్యాన్ని తొలగించి మత సామరస్యాన్ని చాటేందుకు కర్ణాటక సరిహద్దులో ఉన్న కౌతాళంకు వచ్చారు.



ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ

➡ జగద్గురు ఖాదర్‌లింగ స్వామి 404వ జయంతి వేడుకలు ఈనెల 12న శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు దర్గా ధర్మకర్త మున్నపాషా చిష్తీ తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం చదివింపులు అయ్యాక ధార్మిక కార్యక్రమాలు ఉంటాయి. సాయంత్రం స్వామి చిత్రపటాన్ని గ్రామ పురవీధుల గుండా వైభవంగా ఊరేగిస్తారు. రాత్రి గ్రామ ప్రజలు, ఖాదర్‌లింగ స్వామి శిష్యులు, పీఠాధిపతులు, పలువురు ప్రముఖుల మధ్య కేక్‌కట్ చేసి వేడుకలను నిర్వహించనున్నట్లు ధర్మకర్త తెలిపారు. మగ్రీబ్ నమాజ్ తర్వాత ముఫ్తీ మహమ్మద్ మహబూబ్ రజా ఖాద్రి ఖాస్మీ వారిచే ప్రత్యేక బయాన్ ఉంటుంది. అనంతరం రాత్రి ఖవ్వాలి పోటీలు ఉంటాయని ఈ కార్యక్రమాలకు రాష్ట్ర నలుమూలల నుంచి హిందూ, ముస్లిం భక్తులు, ప్రముఖులు పాల్గొని జయప్రదం చేయవలసిందిగా ఆయన కోరారు. ముస్లిం మత గురువుల స్మారకార్థం ప్రతి ఏటా జరుపుకునే ఈ మహోత్సవంలో కులమత భేదాలు లేకుండా అన్ని మతాల వారు పాల్గొనడం కౌతాళంకే ప్రత్యేకం. రాష్ట్రం నలుమూల నుంచే గాక కర్ణాటక, మహారాష్ట్ర, గోవా, తమిళనాడు వంటి రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక ప్రార్థనలు జరిపి ఈ మహోత్సవంలో పాల్గొంటారు. ఉత్సవానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ తెలిపారు.



ఖాదర్‌లింగ స్వామి సమాధికి ఫాతెహాలు సమర్పిస్తున్న భక్తులు



ఖాదర్ లింగస్వామి దర్గా

కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేత

పెద్దకడబూరు: గుండె శస్త్రచికిత్స చేయించుకున్న వృద్ధురాలు కేజీ లక్ష్మికి గురువారం వలంటీర్ జేపీ అనిత కర్నూలుకు వెళ్లి ఆస్పత్రిలో పింఛన్ అందజేసింది. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన కురువ గుడిసె లక్ష్మి కొంతకాలంగా గుండెనొప్పితో బాధపడుతోంది. ఆమెకు ఆరోగ్య శ్రీ కార్డు లేకపోవడంతో సంబంధిత వలంటీర్ విషయాన్ని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బాపురం రామ్మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వారు అధికారులతో మాట్లాడి వృద్ధురాలికి ఆరోగ్య శ్రీ కార్డు మంజూరు చేయించారు. దీంతో ఆమె కుటుంబసభ్యులు కర్నూలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో గుండె ఆపరేషన్ చేయించారు. ఆపరేషన్ సక్సెస్ అవ్వడంతో ఆమె క్రమంగా కోలుకుంటోంది. విషయం తెలుసుకున్న వలంటీర్లు గురువారం కర్నూలకు వెళ్లి వృద్ధురాలికి రూ.3 వేలు పింఛన్ అందించడంతో అవ్వతో పాటు కుటుంబసభ్యులు ఆనందంతో పొంగిపోయారు. పేదల గురించి ఆలోచించే ప్రభుత్వం ఉండడం వల్ల ఈ రోజు అవ్వ ప్రాణాలు కాపాడుకోగలిగామన్నారు. వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



కర్నూలులో గుండె శస్త్రచికిత్స చేయించుకున్న వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ అనిత

దర్గాలో అమావాస్య పూజలు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన కౌతాళం జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో గురువారం అమావాస్య వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వివిధ ప్రాంతా నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక ఫాతేహాలను నిర్వహించారు. శుక్రవారం ఖాదర్‌లింగస్వామి జయంతి కలిసి రావడంతో భక్తులు వేలాదిగా తరలివచ్చారు. కొందరు భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాష చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాల అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. దర్గాలో భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారు.



దర్గాలో బారులు తీరిన భక్తులు

డాక్యుమెంట్ మిస్సింగ్
Sri BJ.Chandra Sekhar S/o Ramaiah, H.No. 2/243/19A, Tirumala Nagar, మండిగిరి-2, ఆదోనికి చెందిన నా యొక్క ఒరిజినల్ డిప్లమా మార్క్స్ మెమోస్ సర్టిఫికేట్స్ vide Roll No. 3156 రిజిస్ట్రేషన్ నం. 007/6305 జిరాక్స్ కోసం వెళ్ళగా తిరుమల నగర్ నుంచి మోర్ సూపర్ మార్కెట్ మధ్యలో పడిపోయినవి. ఆదోని III టౌన్ పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ ఇవ్వడమైనది. పోలీస్ సర్టిఫై నెం. MDL012400391569/ 05.1.24